క్లుప్తంగా

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీపీఐ అభినందనలు


మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రాంతానికి ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేసినందుకు గాను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీపీఐ నేతలు అభినందనలు తెలిపారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ శనివారం మంత్రిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుస్నాబాద్ అభివృద్ధి కోసం మంత్రి పొన్నం నిధులు మంజూరు చేసి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రస్థాయిలో నియోజకవర్గాన్ని నంబర్ వన్ స్థాయిలో ఉంచుతారనే నమ్మకం ఉందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వనేశ్, భాస్కర్, జనార్దన్, గోపి, సుదర్శనచారి తదితరులు ఉన్నారు.

పదవీ విరమణ సహజం


శ్రీనివాస్ దంపతులకు ఉద్యోగుల సన్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ సహజమని, విధి నిర్వహణలో చేసిన పనులే చిరస్థాయిగా నిలుస్తాయని చీఫ్ ఇంజనీర్ హరిరామ్ అన్నారు. నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్ పదవి విరమణ సందర్భంగా మండల పరిధిలోని రంగనాయక సాగర్ గెస్ట్‌హౌస్‌లో శనివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ 38 యేళ్లుగా వివిధ హోదాల్లో సేవలందించారని కొనియాడారు. శ్రీనివాస్, వాణిశ్రీ దంపతులను ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు, నీటి పారుదలశాఖ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

పేదలకు అండగా ఉంటా..


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఫారుఖ్ హుస్సేన్

దుబ్బాకటౌన్: పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ షాదుల్లా ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోగా విషయం తెలుసుకున్న ఆయన శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల చదువులకు భరోసాగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మంజూరు, కిష్టారెడ్డి, శ్రీనివాస్, మహమ్మద్ యూసుఫ్ తదితరులున్నారు.

కోళ్లు మృత్యువాత


పౌల్ట్రీ ఫాంలో మృతి చెందిన కోళ్లు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని రాంనగర్‌కు చెందిన నరేందర్ పౌల్ట్రీలో కోళ్లు మృతి చెందాయి. పౌల్ట్రీ రైతు నరేందర్ శనివారం మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ ప్రభావమో.. ఎండల ప్రభావామో కానీ ప్రతి రోజూ వందల కోళ్లు మృతి చెందుతున్నాయన్నారు. ఇప్పటి వరకు దాదాపు ఐదు వేల వరకు మృతి చెందగా గుంతతీసి పాతిపెట్టినట్లు తెలిపారు. రూ.లక్ష వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

లైబ్రరీ అప్పగింత


తీర్మాన పత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలలో 'రూం టూ రీడ్' సంస్థ నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని పాఠశాలకు అప్పగించింది. మూడేళ్లుగా ఆ సంస్థ ఆధ్వర్యంలో లైబ్రరీ నిర్వహించారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో తీర్మాన పత్రం అందజేశారు. గ్రంథాలయంలో 1,400 కథల పుస్తకాలు, క్యాలెండర్లు, రాత సామగ్రి ఉంది. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ గంగమణి, హెచ్‌ఎం విఠల్, ఉపాధ్యాయులు సురేశ్, కృష్ణమూర్తి, శివకుమార్, రామచంద్రం, వినోద, మధు తదితరులు పాల్గొన్నారు.


హుస్నాబాద్: ఉగాది పచ్చడి చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


దుబ్బాకటౌన్: లచ్చపేట మోడల్ స్కూల్లో ..

ఉగాది తెలుగువారి సంస్కృతికి ప్రతీక

పాఠశాలల్లో ఘనంగా ముందస్తు వేడుకలు ● ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు


చేర్యాల(సిద్దిపేట): కొత్తదొమ్మాట పాఠశాలలో ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలు

శ్రీవిశ్వవసు నామ సంవత్సర ఉగాది ముందస్తు వేడుకలను శనివారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాలలను పచ్చటి మామిడి తోరణాలతో అలంకరించారు. ఉపాధ్యాయులు వారికి సంస్కృతి, సంప్రదాయాల గురించి వివరించారు. ఉగాది పచ్చడిని తయారు చేయించి దాని ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉగాది తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు.


అక్కన్నపేట(హుస్నాబాద్): ఉగాది పచ్చడి తింటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


గజ్వేల్‌రూరల్: మంజీరా కాన్సెప్ట్ పాఠశాలలో..


బెజ్జంకి ప్రాథమిక పాఠశాలలో..

చెడువ్యసనాలకు బానిసలు కావొద్దు

నార్కోటిక్ డ్రగ్ ఏసీపీ పుష్పకుమార్


మాట్లాడుతున్న ఏసీపీ పుష్పకుమార్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యం దిశగా ముందుకు సాగాలని నార్కోటిక్ డ్రగ్ ఏసీపీ పుష్పకుమార్ అన్నారు. ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో శనివారం సైబర్ నేరాలు, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, డ్రగ్స్ తదితర అంశాలపై సీఐ సైదా, ట్రాఫిక్ సీఐ మురళి, నార్కోటిక్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రామ్‌నాయక్‌తో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితుల నుంచి అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని, మైనర్లు వాహనాలు నడపడం ప్రమాదకరమని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, సిబ్బంది లావణ్య, మహేశ్, ప్రిన్సిపాల్స్ రాయప్ప, విజయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగరాజుశర్మ సేవలు అభినందనీయం

డీపీఆర్ఓ రవికుమార్


నాగరాజుశర్మను సన్మానిస్తున్న డీపీఆర్ఓ తదితరులు

సిద్దిపేటరూరల్: నాగరాజుశర్మ సేవలు ఎంతో అభినందనీయమని డీపీఆర్ఓ రవికుమార్ అన్నారు. కలెక్టరేట్లోని డీపీఆర్ఓ కార్యాలయంలో ఆడియో విజువల్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తించిన నాగరాజు శర్మ పదవి విరమణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఆర్ఓ, సమాచార ఇంజనీరింగ్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. రవి కుమార్ మాట్లాడుతూ నాగరాజు శర్మ 32 సంవత్సరాలు పబ్లిసిటీ అసిస్టెంట్‌గా, ఆడియో విజువల్స్ సూపర్‌వైజర్‌గా సేవలందించారని, ఫొటోగ్రాఫర్‌గా సేవలందించి మెప్పు పొందారన్నారు. కార్యక్రమంలో సమాచారశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ భూపాల్‌రెడ్డి, రిటైర్డ్ డీపీఆర్ఓ శాంతి కుమార్, సమాచారశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతి నాయక్, రిటైర్డ్ ఏపీఎస్ కిషోర్ బాబు, నిజామాబాద్ ఏపీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మైనార్టీల అభివృద్ధి

పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్‌తోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఎక్కడా కక్ష పూరిత రాజకీయాలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులే ఓట్ల రాజకీయం చేస్తారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలనలో ముస్లింలను అణచివేశారని ఆరోపించారు. ముస్లింలకు ఎలాంటి పదవులు ఇవ్వకుండా ముస్లిం అభివృద్ధిని అడ్డుకున్నారని వాపోయారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు మెప్పు పొందేందుకు బీఆర్ఎస్ ముస్లిం నాయకులు ఇతర పార్టీలపై బురద జల్లే కార్యక్రమం పెట్టుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు వహాబ్, పట్టణ అధ్యక్షుడు గయాజొద్దీన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అజ్మత్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాశాద్, అజ్మత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణే ధ్యేయం: సీపీ


మొక్క నాటుతున్న అనురాధ

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రజల రక్షణే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని పోలీసు కమిషనర్ అనురాధ సూచించారు. దౌల్తాబాద్, రాయపోల్ పోలీసుస్టేషన్లను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసర ప్రాంతాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం పోలీస్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, తొగుట సీఐ లతీఫ్, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, శ్రీధర్ గౌడ్, దౌల్తాబాద్, రాయపోల్ ఎస్ఐలు శ్రీరామ్ ప్రేమ్ దీప్, రఘుపతి పాల్గొన్నారు.

తై బజార్ వేలం రూ.4లక్షలు

దౌల్తాబాద్(దుబ్బాక): మండల కేంద్రంలోని వారాంతపు సంత నిర్వహణకు పంచాయతీ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి గఫూర్ కాద్రి ఆధ్వర్యంలో శనివారం వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన బోరింగ్ శ్రీనివాస్ రూ.4,01,600 దక్కించుకొన్నాడు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

వైకుంఠానికి గ్లోబల్ ఐకాన్ అవార్డు

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ వైకుంఠం గ్లోబల్ ఐకాన్ అవార్డు అందుకొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని బిర్లాసైన్స్ మ్యూజియంలో మెగా హెల్పింగ్ ఫౌండేషన్ శిరీషరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. సింగింగ్‌లో ప్రతిభ కనబర్చినందుకు గాను ఆయన అవార్డుతో పాటు సర్టిఫికేట్, జ్ఞాపికను అందుకున్నారు. శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, సీఓఈ గోపాలసుదర్శనం, డా.మధుసూదన్, శ్రద్ధానందం ఆయనను అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ **మంత్రి పొన్నం చిత్రపటానికి క్షీరాభిషేకం**

అక్కన్నపేట(హుస్నాబాద్): స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజాపరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. అయిలయ్య, సంజీవ్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **పిన్నింటి రత్నానికి నంది అవార్డు**

కొమురవెల్లి(సిద్దిపేట): అయినాపూర్‌కు చెందిన ఉద్యమ కళాకారుడు, సంస్కృతిక సారథి, గాయకుడు పిన్నింటి రత్నం జాతీయ ప్రతిభ నంది అవార్డును సినీనటుడు బాబుమోహన్ చేతుల మీదుగా శనివారం హైదరబాద్‌లో అందుకొన్నారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ప్రతియేటా అందించే ఈ పురస్కారానికి తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు.

◆ **నిధులు మంజూరు చేయాలని వినతి**

అక్కన్నపేట(హుస్నాబాద్): పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మసిరెడ్డితండా యువకులు మాలోతు మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కోరారు. వారంతా శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోహన్‌నాయక్ మాట్లాడుతూ గ్రామ పరిధిలోని ర్యాగటోనిపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణాలు, హై మాక్స్ లైట్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని విన్నవించామన్నారు. కార్యక్రమంలో రూప్‌సింగ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నియోజకవర్గ సన్నాహక సమావేశం**



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంపై వ్యవహరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పార్టీ ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలీమొద్దీన్, యాదగిరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ**

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉగాది పర్వదినం సందర్భంగా తెలుగు సంవత్సర క్యాలెండర్‌ను మండల కురుమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ తెలుగు సంవత్సర క్యాలెండర్ సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేస్తుందన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం మండల నాయకులు తిరుపతి, కిష్టయ్య, రవి, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **విచారణ జరిపించండి**

హుస్నాబాద్: అంగడి ఆదాయం తగ్గడానికిగల కారణాలపై ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్ అంగడికి ఐదు జిల్లాల నుంచి వ్యాపారులు వస్తుండటం వల్ల మార్కెట్ రోజురోజుకు పెరుగుతోందని, గుత్తేదారులు సిండికేటై గతం కంటే రూ.28 లక్షలకు తగ్గించి అంగడిని దక్కించుకున్నారని ఆరోపించారు.

◆ **ఫౌండేషన్ సేవలు అభినందనీయం**

సిద్దిపేటజోన్: సిద్దిపేట ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ మంజుల అన్నారు. స్థానిక మెట్రో గార్డెన్స్‌లో రంజాన్ సందర్భంగా ముస్లింలకు శనివారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 యేళ్లుగా ఫౌండేషన్ వివిధ సేవా కార్యక్రమాలు చేస్తోందని కొనియాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, కౌన్సిలర్లు నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో వేడుకలు**

సిద్దిపేటజోన్: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆదివారం బ్రాహ్మణ పరిషత్ సంక్షేమ సదనంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు రాధాకృష్ణ శర్మ, హరిహరరావు, సత్యనారాయణ, వెంకట నర్సింహచార్యులు, రంగా చార్యులు, శేషుకుమార్, నాగరాజుశర్మ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరుకానునట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

మండల విద్యాధికారి సత్తయ్య


టెస్టు పేపర్లను పరిశీలిస్తున్న ఎంఈఓ సత్తయ్య

కొండపాక(గజ్వేల్): పాఠశాలలను కాపాడుకొనే బాధ్యత ముఖ్యంగా ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. మండలంలోని మాత్‌పల్లి, కాశనగర్ ప్రాథమిక పాఠశాలలను శనివారం సందర్శించారు. వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఎండ్ లైన్ టెస్టు పేపర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చేలా చూసుకోవాలన్నారు. ఎండ్‌లైన్ టెస్టు పేపర్లను దిద్దిన తరువాతనే స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో సబ్మిట్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల ఆరోగ్య పరిరక్షణకే పరేడ్

అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్


మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆరోగ్య పరిరక్షణ కోసమే పరేడ్ నిర్వహిస్తున్నట్లు ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి శనివారం పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది క్రమం తప్పకుండా వాకింగ్, రన్నింగ్, యోగా వంటివి చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. శక్తి, సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురి కాకుండా విధులు నిర్వహించడానికి అవకాశం ఉంటుందని; చెడు వ్యసనాలకు అలవాటు పడి విధులలో నిర్లక్ష్యం వహిస్తే పోలీసుల ప్రతిష్టకు భంగం కలిగించే వారవుతారని చెప్పారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ఆర్టీసీకి ఆదరణ


సిబ్బంది, ఉద్యోగులతో రీజినల్ మేనేజర్ ప్రభులత

మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత

గజ్వేల్‌రూరల్: ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఆర్టీసీకి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని ఆర్టీసీ మెదక్ రీజినల్ మేనేజర్ ఎస్తేర్ ప్రభులత అన్నారు. ప్రజ్ఞాపూర్‌లోని జీపీపీ ఆర్టీసీ డిపోను శనివారం సందర్శించారు. ఆయా విభాగాలను పరిశీలించి అనంతరం ఆదర్శ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు వడదెబ్బ నుంచి రక్షణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. డిపోలో మజ్జిగ, తాగునీరు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్, అసిస్టెంట్ మేనేజర్ బాబు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ నిధులు కేటాయించాలి

పీఆర్టీయూ జిల్లా నాయకులు


డీఈఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రీ ప్రైమరీ నిధులు కేటాయించాలని, పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇంద్రసేనా రెడ్డి, శశిధర్‌శర్మ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠమిక పాఠశాలలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తే మౌలిక సౌకర్యాల కల్పనకు అవకాశం ఉంటుందన్నారు. తద్వారా నాణ్యమైన విద్య అందేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి ఏప్రిల్‌లోగా నిధులు కేటాయించి, విడుదల చేయాలని కోరారు. సామాజిక సమగ్ర సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని, గత విద్యా సంవత్సరం పదోతరగతి మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు, సిబ్బందికి వెంటనే పారితోషికం జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా ఉగాది కవి సమ్మేళనాలు


హుస్నాబాద్: కవులను సన్మానిస్తున్న భిక్షపతి

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు విభాగధిపతి సుధా మాధురి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతసాగర్ పాఠశాలలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ ఉన్నత పాఠశాలలో బాలకవి సమ్మేళనం నిర్వహించారు. చిన్నారులు తమ కవితలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జ్యోతి మాట్లాడుతూ తెలుగు భాష; సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఉగాది ఉండుగ అన్నారు. ఉత్తమ కవితలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచుదాం

జీజేసీపీఏ నాయకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల నియామకమైన నూతన అధ్యాపకులకు ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లు, ప్రిన్సిపాల్స్ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్స్ సంఘం(జీజేసీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణకుమర్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ విద్యను బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. రాబోయే విద్యాసంవత్సరానికి కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన అధ్యాపకులను శాలువాతో సన్మానించి పెన్నులను అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం(జీజేఎల్ఏ) జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారయణరెడ్డి తదిదరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా అడ్డగింత

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల మండలంలోని కమలయాపల్లిలోని వెలిగాలరాయ చెరువు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా కమలయాపల్లి గ్రామస్తులు ట్రాక్టర్‌లను అడ్డుకొన్నారు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకొంది. ఈ సందర్భంగా కమలయాపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ చెరువులో నుంచి అక్రమంగా ఇసుకను తరలించడం వల్ల భూగర్భజలాలు అడుగంటుతామన్నారు. వసూళ్లకు అలవాటుపడిన అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. అధికారులు తక్షణమే స్పందించి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. మద్దూరు ఏఎస్ఐ విజయ్‌కుమార్‌ను వివరణకోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.